

అన్ని వర్గాలకు ఊరట

- కేంద్ర బడ్జెట్‌లో రైతులు, యువత, మహిళలకు పెద్ద పీట
- పీఎంఏవై కింద జిల్లాకు మరిన్ని ఇళ్లు



కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్.. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు.. ఇలా అన్ని వర్గాలకూ ఊరట కలిగించ నుంది. ఇలా జిల్లా వాసులకు పలు ప్రయోజనాలు కల్పించనుంది. బడ్జెట్ కేటాయింపులు వెల్లడైంది స్థూలంగా మాత్రమే. ఆయా రంగాలకు కేటాయింపుల వివరాలు తెలియడానికి మరికొంత సమయం పట్టనుంది. వీటితో నిమిత్తం లేకుండా ఇతర కేటాయింపులతో జిల్లా ప్రజలకు పలు ప్రయోజనాలు కలగనున్నాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

జిల్లాకు మరిన్ని పక్కా గృహాలు మంజూరు కానున్నాయి. పీఎం అవాస్ యోజన 2.0 కింద దేశంలోని పేదలకు 3 కోట్ల పక్కా గృహాలను మంజూరు చేస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. గత ఐదేళ్లలో జిల్లాలో 73 వేల గృహాల్ని కేంద్రం మంజూరు చేయగా.. సుమారు 34 వేలు పూర్తయ్యాయి. ఈ లెక్కన జిల్లాలోని మరింత మంది పేదలకు సొంతింటి కల సాకారం కానుంది. పేదల గృహాల నిర్మాణానికి రూ.1.80 లక్షల్ని కేంద్రం ఇన్నాళ్లు ఇచ్చింది. అంతకు ముందు టీడీపీ ప్రభుత్వం రూ.లక్ష రాష్ట్ర వాటా వేయగా.. గత ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం తన వాటా ఇవ్వలేదు. కరోనా తర్వాత పెరిగిన ధరలతో లబ్ధిదారులపై తీవ్ర భారం పడింది. చాలామంది నిర్మాణానికి ముందుకు రాలేదు. ఈసారి యూనిట్ కాస్ట్‌ను కేంద్రం పెంచుతుందని లబ్ధిదారులు ఆశించగా.. ఈ విషయంలో క్లారిటీ ఇవ్వలేదు. వ్యక్తి, వ్యాపారం స్థాయిని బట్టి రూ.10 లక్షల వరకే ఇచ్చే 'ముద్ర' రుణాల పరిమితిని రూ.20 లక్షల వరకు పెంచారు. ఇది సొంతంగా వ్యాపారాలు, పరిశ్రమలు పెట్టుకునే యువతకు ఊరటనిచ్చే అంశం.

జిల్లాకు రూ.50 కోట్లు

వెనుకబడిన జిల్లాల (రాయలసీమ) అభివృద్ధికి రూ.50 కోట్ల చొప్పున కేంద్రం మంజూరు చేసింది. 2014-19 మధ్యకాలంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈ నిధులను కేంద్రం రెండుసార్లు ఇచ్చింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా మంజూరు కాలేదు. ఇప్పుడు మళ్లీ ఈ నిధుల్ని మంజూరు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాను పరిగణలోకి తీసుకుని నిధులు ఇవ్వనున్నారు.

భూములకు ఆధార్

భూసంస్కరణల్లో భాగంగా రాష్ట్రాల సమన్వయంతో భూములకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (భూ ఆధార్)ను కేటాయిస్తున్నట్లు కేంద్రం ప్రతిపాదించింది. మూడేళ్లలో ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని కేంద్రమే అందిస్తుంది. వైసీపీ చేపట్టిన రీసర్వే సక్రమంగా జరగక జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో భూ ఆధార్ కింద భూములకు నంబర్లను కేటాయించడం, భూ మ్యాప్‌లను డిజిటలైజ్ చేయడం, ప్రస్తుత యజమానులకు అనుగుణంగా మ్యాప్‌లను సబ్ డివిజన్లుగా విభజించడం, భూ రికార్డులు రూపొందించి.. సంబంధిత రైతులను వాటికి అనుసంధానించడం తదితర పనులు పూర్తి చేయనున్నారు. దీని వల్ల లబ్ధిదారులకు నేరుగా ప్రభుత్వ పథకాలు అందుతాయి.

మహిళలకు ప్రాధాన్యం

మహిళల పేరిట కొనుగోలు చేసే ఆస్తులపై సుంకాన్ని మరింతగా తగ్గించడంపై కేంద్రం దృష్టి సారిస్తోంది. భారీగా స్టాంప్ డ్యూటీ వసూలు చేస్తున్న ప్రాంతాలను సమీక్షించి వాటినీ తగ్గించేందుకు ప్రయత్నిస్తామని కేంద్రం ప్రకటించింది. స్థిరాస్తులు కొనుగోలు చేసే జిల్లా వాసులకు ఈ విధానంతో మరింత లబ్ధి కలుగుతుంది. అలాగే, పరిశ్రమల సహకారంతో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక హాస్టళ్లు, శిశు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, గంగవరం, జీడీనెల్లూరు, కుప్పం ప్రాంతాల్లో పరిశ్రమల హబ్‌లు న్నాయి. ప్రత్యేక హాస్టళ్ల విధానంతో ఉద్యోగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుంది.

ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట

మన జిల్లాలో కొందరు రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. అయితే, సరైన సహకారం లభించక ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో వచ్చే రెండేళ్లలో కోటి మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలోకి వచ్చేలా ప్రోత్సహిస్తామని కేంద్రం ప్రకటించింది. ప్రకృతి వ్యవసాయం చేసేవారి ఉత్పత్తులకు బ్రాండింగ్, సర్టిఫికేషన్ ఇవ్వనున్నట్లు చెప్పింది. దీంతో జిల్లాలోనూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య గణనీయంగా పెరగనుంది.

- నైపుణ్య శిక్షణ.. రూ.10 లక్షల రుణాలు

వచ్చే ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు నైపుణ్యాల శిక్షణ ఇచ్చి 500 పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌లు చేయిస్తామని కేంద్రం చెప్పింది. దేశంలోని సుమారు వెయ్యి ఐటీఐలను హబ్ అండ్ స్పోక్ మోడల్ కింద ఉన్నతీకరిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికో స్కిల్ కాలేజ్‌ను ఏర్పాటు చేసింది. ఇలా చిత్తూరులో స్కిల్ కాలేజ్ నడుస్తోంది. ఇప్పుడు జిల్లాలోని ఎంపిక చేసిన కాలేజీల్లోనూ నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. దేశీయ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు విద్యార్థులకు రూ.10 లక్షల వరకు విద్యా రుణాలూ మంజూరు చేయనున్నారు.

కేంద్ర బడ్జెట్ ఎలా ఉందంటే..!

రాష్ట్రానికి వరాల జల్లు
సీఎం చంద్రబాబు కృషితో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వరాల జల్లు కురిసింది. రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తామని, విభజన చట్టంలోని అంశాలను అమలు చేస్తామని ప్రకటించడంపై ప్రజలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు ప్రకటించడం హర్షణీయం.
- దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు ఎంపీ

యువతకు మెండుగా ఉపాధి
పరిశ్రమల ఏర్పాటుకోసం ప్రత్యేక రాయితీలు ప్రకటించడం, విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్.. హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.
- గురజాల జగన్మోహన్, చిత్తూరు ఎమ్మెల్యే

వెనుకబడిన జిల్లాలకు మేలు
విభజన చట్టంలో పొందుపర్చినట్లు వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ఆర్థిక సాయం అందిస్తామని బడ్జెట్‌లో ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నా. దీనివల్ల వెనుకబడిన జిల్లాలకు మేలు కలగనుంది.
- మురళీ మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

అమరావతికి నిధులు హర్షణీయం
రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు మంజూరు కావడం హర్షణీయం. రాష్ట్రానికి భారీ నిధులు రావడం సంతోషం కలిగించే విషయం.
- థామస్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే

అభివృద్ధి వైపు పరుగులు తీయనున్న రాష్ట్రం
అమరావతి రాజధాని అభివృద్ధికి రూ.15 వేల కోట్లు ఆర్థిక సాయం, పోలవరం పూర్తికి నిధులు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ తదితరాలను కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్నారు. వీటితో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీయనుంది.
- దొరబాబు, మాజీ ఎమ్మెల్సీ

అమరావతికి ఆసరా
కేంద్ర బడ్జెట్‌లో అమరావతి నిర్మాణానికి రూ. 15 వేల కోట్ల నిధులు కేటాయించడం సంతోషకరం. పోలవరం నిర్మాణానికి కూడా బడ్జెట్ బాసటగా నిలిచింది. విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు నిధులు కేటాయించడం హర్షదాయకం.
- చిన్నస్వామి నాయుడు, రిటైర్డు ఎకనామిక్స్ ప్రొఫెసర్

వెనకబడిన జిల్లాలకు నిధులివ్వడం సంతోషకరం
విద్య, నైపుణ్యాభివృద్ధికి రూ.లక్షన్నర కోట్లు, వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు కేటాయించడం మంచి పరిణామం. ఐదేళ్లలో నాలుగు కోట్లమందికి ఉపాధి కల్పించడంతో పాటు స్వయం ఉపాధి పొందుతున్న చేతివృత్తి మహిళలకు రుణ సాయం పెంచడం మంచి పరిమాణం. వెనుకబడిన జిల్లా కోటాలో అందే ప్రత్యేక నిధుల వల్ల మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుంది.
- కొండేటి సునీత, ఎస్వీయూ ఎకనమెట్రిక్స్ ప్రొఫెసర్

నిరాశాపూరితం
కొత్త పన్నుల విధానంలో స్వల్ప మార్పులు చేయడంవల్ల వేతన జీవులకు నిరాశ మిగిలింది. ఈ విధానంలో ఎక్కువ పన్ను చెల్లించాల్సిరావడంతో మళ్లీ పాత విధానమే మేలనుకునే పరిస్థితి వచ్చింది. సీపీఎస్ విధానంలో మార్పులు చేస్తామంటూనే పాత పెన్షన్ అమలుపై ప్రకటన లేకపోవడం నిరాశ పరిచింది. విద్యారంగానికి 6 శాతం బదులు 3.25 శాతం నిధులు కేటాయించడం కేంద్రప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది
- కె. ముత్యాలరెడ్డి, యూటీఎఫ్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి

'కారుణ్యం' చూపని గౌతమ్‌తేజ్!

- చిత్తూరులో పనిచేసినప్పుడు కారుణ్య నియామకాలకు భారీగా వసూళ్లు
- ఇప్పుడు మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో రికార్డులు కాలిన ఘటనలో నిందితుడు

చిత్తూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టరు కార్యాలయంలో 22(ఏ) సెక్షన్‌లో రికార్డులను ఉద్దేశపూర్వకంగా కాల్చారని ఉన్నతాధికారులు నిర్ధారించిన ఘటనలో నిందితుడైన గౌతమ్‌తేజ్ కెరీరంతా అవినీతిమయమే. ఆ సెక్షన్ క్లర్కు (సీనియర్ అసిస్టెంట్) అయిన ఇతడు 'కారుణ్య' నియామకం ద్వారా చిత్తూరు కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. కారుణ్య నియామక విభాగానికి ఇన్‌ఛార్జిగా పనిచేశారు. ఇతడి కెరీర్ అవినీతిమయమేనని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. డబ్బులిస్తే ఏ పనైనా చేస్తాడని అంటున్నారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలో చేరిన ఇతడు ఏమాత్రం 'కారుణ్యం' చూపేవాడు కాదంటూ ఐదేళ్ల కిందటి ఘటనను ఇప్పుడు గుర్తుచేసుకుంటున్నారు. కారుణ్య నియామక విభాగానికి ఇన్‌ఛార్జిగా పనిచేసేటప్పుడు 2019 జూలైలో సుమారు 25 మంది అభ్యర్థుల వద్ద రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారు. అంటే, ఉద్యోగి అయిన తండ్రి చనిపోయి బాధలో ఉన్న ఆ కుటుంబం నుంచి నిర్దాక్షిణ్యంగా డబ్బు వసూలు చేచేశాక ఫైల్‌ను ప్రాసెస్ చేసేవారన్న ఆరోపణలున్నాయి. దీనిపై 2019 జూలైలో 'ఆంధ్రజ్యోతి'లో కథనం కూడా ప్రచురితమైంది. ఇప్పుడు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దుండగులు రికార్డులు కాల్చిన 22(ఏ) సెక్షన్‌కు సంబంధించి గౌతమ్‌తేజ్ ఇప్పుడు క్లర్కుగా పనిచేస్తున్నారు. ఇతడి గత వ్యవహార శైలిని పరిశీలించిన రెవెన్యూ వర్గాలు అనేక అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. కాగా, ఈ ఘటనలో పలువురు సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరిలో గౌతమ్‌తేజ్ కూడా ఉన్నారు. పోలీసుల విచారణలో అతడు ఏదీ ఒప్పుకోలేదని తెలుస్తోంది.

ఏపీకే ఆదర్శంగా దత్తత గ్రామాలు

- యువత ఉపాధికోసం మూడు పరిశ్రమలు
- మహిళల ఆదరాభిమానాలే నన్ను ఇక్కడికి రప్పించాయి
- కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి



కమ్మగుట్లపల్లెలో మహిళల ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న భువనేశ్వరి



కుప్పం/గుడుపల్లె, జూలై 23: 'కుప్పం నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ ఇచ్చిన రెండు పంచాయతీలను నేను దత్తత తీసుకుంటున్నా. వీటిని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేస్తా' అని సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. తన నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజైన మంగళవారం గుడుపల్లె మండలంలోని కమ్మగుట్లపల్లె, కంచిబందార్లపల్లె, కోటపల్లె, గుత్తార్లపల్లె గ్రామాలలో ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో మహిళలతో ముఖాముఖిగా మాట్లాడారు. అత్యధిక మెజారిటీ తీసుకొచ్చిన గ్రామాలను దత్తత తీసుకుంటామని ఇచ్చిన హామీ మేరకు కంచిబందార్లపల్లె.. కుప్పం మండలంలోని పైపాళ్యం గ్రామాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అందరూ కష్టపడి పనిచేయడంవల్లే, చంద్రబాబు మీద ఎనలేని అభిమానం చూపించినందువల్లే మెజారిటీ సాధ్యమైందన్నారు. అందుకు కృతజ్ఞతగా ఆ రెండు గ్రామాలను దత్తత తీసుకుని మౌలిక సదుపాయలను కల్పిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో యువత ఉపాధికోసం మూడు పెద్ద పరిశ్రమలను తీసుకొస్తామని ప్రకటించారు. విద్యతోపాటు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభించేలా చూస్తామన్నారు. అప్పట్లో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరాచకాలు, అక్రమాలు చేసిన వారికి ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పారన్నారు. ప్రజాస్వామ్యంలో సత్యం, ధర్మం, నిజాయితీలే గెలుస్తాయని ఈ ఎన్నికలు నిరూపించాయన్నారు. కుప్పం ప్రజలపై ఎన్ని అక్రమ కేసులు బనాయించినా, ఎంత వేధించినా, ఎంత భయపెట్టినా వెరవకుండా ధైర్యంగా నిలబడి టీడీపీ జెండాలు ఎగురవేశారని ప్రశంసించారు. చంద్రబాబుతో పనిలేకుండా తాను ప్రతి రెండు మూడు నెలలకోసారి కుప్పం వస్తానని, ఇక్కడి ప్రజల సాధకబాధకాలు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో కుప్పం ప్రజలకు ఇచ్చిన ప్రత్యేక మ్యానిఫెస్టో అమలు చేయడానికి చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. కుప్పం తన కుటుంబమని, అన్ని వేళలా ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఆయా సమావేశాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ కుప్పం నియోకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం, నాయకులు డాక్టర్ సురేశ్‌బాబు, గుడుపల్లె మండల పార్టీ అధ్యక్షుడు బాబు, మాజీ ఎంపీపీలు జీఎం రాజు, చంద్రశేఖర్‌తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నేటి షెడ్యూల్ : బుధవారం ఉదయం 9 నుంచి 9.30 గంటలదాకా పీఈఎస్ ఆడిటోరియంలో మున్సిపల్ టీడీపీ నేతలతో భువనేశ్వరి సమావేశమవుతారు. అనంతరం ఎన్.కొత్తపల్లెలో 9.45 నుంచి 10.45 గంటల వరకు.. నడిమూరులో 11 నుంచి మధ్యాహ్నం 12 గంటలదాకా మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. దత్తత గ్రామంగా ప్రకటించిన పైపాళ్యంలో 12.15 నుంచి 1.15 గంటలదాకా మహిళలతో సమావేశమవుతారు. ఉర్లవోబనపల్లెలో 2 నుంచి 3 గంటల దాకా.. గుడ్లనాయనిపల్లెలో 3.15 నుంచి సాయంత్రం 4.15 వరకు మహిళలతో సమావేశమవుతారు. అనంతరం శాంతిపురం మండలం శివపురం వద్ద సొంతింటి నిర్మాణాన్ని పరిశీలించి సాయంత్రం 5.40 గంటలకు పీఈఎస్ గెస్ట్ హౌస్ చేరుకుంటారు.

రెవెన్యూ కార్యాలయాల వద్ద భద్రత

జేసీ శ్రీనివాసులు ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 23: జిల్లాలోని రెవెన్యూ డివిజనల్, మండల తహసీల్దార్ల కార్యాలయాల్లో రికార్డుల భద్రతకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన ఫైళ్ల దగ్ధం సంఘటన నేపథ్యంలో ఆర్డీవోలు, తహసీల్దార్లకు ఆయన మంగళవారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. రెవెన్యూ రికార్డుల భద్రతాపరంగా అప్రమత్తంగా ఉండాలన్నారు. రోజూ రాత్రివేళల్లో కాపలా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి లోకాయుక్త, సమాచార హక్కు చట్టం, వెబ్‌ల్యాండ్, అసైన్మెంట్, 22ఏ భూముల వివరాలు, మ్యుటేషన్, కోర్టుకేసులు, ఇళ్ల స్థలాల వివరాలన్నీ హార్డ్‌కాపీతో పాటు సాఫ్ట్‌కాపీలు కూడా భద్రంగా ఉంచాలన్నారు. అనుమానితులెవరైనా కార్యాలయాల వద్ద తిరుగుతుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. స్థానిక పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని రాత్రివేళల్లో కార్యాలయాల వైపు పెట్రోలింగ్ జరిగేలా చూడాలని జేసీ సూచించారు.

మీ గ్రామంలో వీళ్లున్నారా?

- మృతి చెందిన రాగానిపల్లె భూ వారసుల ఆచూకీ కోసం అధికారుల తంటాలు
- లభించని ముగ్గురి వారసుల ఆనవాళ్లు
- నోటీసుల జారీ కోసం తహసీల్దారు మల్లగుల్లాలు

పుంగనూరు, జూలై 23: పుంగనూరు మండలం రాగానిపల్లెలో రూ.100 కోట్ల విలువచేసే 982.49 ఎకరాల భూమి వారసులుగా రికార్డుల్లో ఉంటూ మృతి చెందిన ముగ్గురి కుటుంబ వారసుల ఆచూకీ కోసం అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. రాగానిపల్లె, మల్లుపల్లె, లక్కుంట గ్రామాల్లో మంగళవారం తహసీల్దార్ శివయ్య విచారించినా.. వీరి ఆనవాళ్లు లభించలేదు. 1907లో నాటి పుంగనూరు జమిందారు మహదేవరాయులు పేరుతో పుంగనూరు మండలంలోని 982.49 ఎకరాలకు పట్టా ఇచ్చారు. 1958లో మహదేవరాయులు కుమారుడు శంకరరాయులు పేరుతో ప్రభుత్వం ఆ భూమికి రఫ్ పట్టా ఇవ్వగా దీన్ని ఆయన వెంకటస్వామి, రెడ్డెప్పరెడ్డికి విక్రయించడంతో వారికి రైత్వారీ పట్టాలు వచ్చాయి. దీంతో ఈభూమి పలువురి చేతులు మారింది. 1977 ఫిబ్రవరి 24న శంకరరాయులకు ఇచ్చిన పట్టాను ప్రభుత్వం రద్దు చేయగా.. ఈభూమికి హక్కుదారులుగా వారసులైన తమకు న్యాయం చేయాలని వెంకటస్వామి, రెడ్డెప్పరెడ్డి కోర్టును ఆశ్రయించారు. ఈభూమి నిషేధిత భూమిగా 22ఏ జాబితాలో ఉండగా గతేడాది.. అప్పటి జేసీ వెంకటేశ్వర్ ఆ జాబితానుంచి రద్దు చేశారు. ఈ భూమిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులకు కట్టబెట్టారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో దీనిపై ఫిర్యాదులు వెళ్లాయి. ఈభూముల విషయంలో నిబంధనలు పాటించలేదని ప్రభుత్వానికి అనుకూలంగా భూములున్నాయని తహసీల్దార్ శివయ్య ఇటీవల అమరావతి సీసీఎల్ఏలో రివిజన్ పిటీషన్ దాఖలు చేశారు. సంబంధిత 41మందికి నోటీసులు జారీ చేసి సోమవారం అమరావతిలో సీసీఎల్ఏ కమిషన్ ఎదుట హాజరుకావాలని సూచించారు. ఈ ఘటనలో మృతుల కుటుంబీకులు, వారసులకు నోటీసులు ఎందుకు జారీ చేయలేదని తహసీల్దారును సీసీఎల్ఏ కమిషనర్ సిద్ధార్థజైన్ ప్రశ్నించారు. వారికి నోటీసులు ఇచ్చి గురువారం (25వతేది) వాయిదాకు హాజరుకావాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో మృతురాలు సరోజమ్మ సమాధి వద్దకు వెళ్లి పరిశీలించడం, గ్రామంలో విచారించి వివరాలు సేకరించారు. అలాగే ఎస్.పాపులమ్మ ఐదేళ్ల క్రితం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదిశేషయ్య, యానాదయ్య, ఆర్.రామకృష్ణ ఆచూకీ తెలియలేదు. సమీప గ్రామాల్లో విచారించగా ఈ ముగ్గురి పేర్లే తమకు తెలియదని చెబుతున్నారు. సీసీఎల్ఏ కమిషన్ ఎదుట గురువారం హాజరు కావాల్సి ఉండగా, మృతుల కుటుంబ వారసులు సమాచారం తెలియక తలలు పట్టుకుంటున్నారు. గ్రామాల్లో తహసీల్దారు శివయ్య, ఆర్ఐ వసీంఅహ్మద్, వీఆర్వోలు చంద్రకుమార్, శశికుమార్ తదితరులు విచారణ చేశారు.



రాగానిపల్లెలో మృతుల గురించి విచారిస్తున్న తహసీల్దార్ శివయ్య

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఉమ్మడి చిత్తూరు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టుకు సూరయ్యగారిపల్లె విద్యార్థులు



సోమల, జూలై 23: ఉమ్మడి చిత్తూరు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టుకు సూరయ్యగారిపల్లె హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం.నిరంజన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఐరాల హైస్కూల్లో జరిగిన జిల్లా ఎంపిక పోటీల్లో విద్యార్థులు అనన్య, అనిషా, వేదమూర్తి, గణేశ్ ఉత్తమ ప్రతిభ కనబరిచారని వివరించారు. ఆగస్టు నెల 17, 18, 19వ తేదీలలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పీడీ శివకుమార్ తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు సూరయ్య ప్రకాశ్, కుసుమ, విద్యావతి, ఏవీ రెడ్డి అభినందించారు.

వేరుశెనగలో అంతర పంటలు సాగు శ్రేయస్కరం



తిమ్మసముద్రంలో వేరుశెనగ పంటను పరిశీలిస్తున్న మురళీకృష్ణ

రామకుప్పం, జూలై 23: వేరుశెనగ రైతులు అంతర పంటలు సాగు చేయడం శ్రేయస్కరమని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన రామకుప్పం మండలం తిమ్మసముద్రం గ్రామంలో వేరుశెనగపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అంతర పంటల సాగును కచ్చితంగా చేపట్టాలని రైతులకు సూచించారు. వేరుశెనగ పంట దెబ్బతిన్నప్పటికీ, అంతరపంట దిగుబడితో ఆ నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అమృత, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఆనంద్, తిప్పేస్వామి పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆడి పూజలు వైభవంగా నిర్వహించాలి



పూజల నిర్వహణపై చర్చిస్తున్న గ్రామపెద్దలు

రామకుప్పం, జూలై 23: రామకుప్పం మండలం పాలరేవుగడ్డలోని బాలమురుగన్ ఆలయంలో ఈ నెల 29న ఆడికృత్తిక, వచ్చే నెల 4న ఆడిపద్దెనిమిది పూజలు వైభవంగా నిర్వహించాలని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారిలు కోరారు. మంగళవారం బాలమురుగన్ ఆలయంలో చుట్టపక్కల గ్రామాల పెద్దలతో వారు సమావేశమై పూజల నిర్వహణపై చర్చించారు. పూజలు జరిగే రెండు పర్వదినాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు, చుట్టుపక్కల గ్రామాల పెద్దలు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. క్యూలైన్లు, తాగునీటి వసతి, భోజన వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు నాగభూషణం, జయశంకర్, శంకర్, హనుమంతు, ఎర్రప్ప, మునిరత్నం, చంద్ర, పెరియప్ప పాల్గొన్నారు.

జ్వరాల నివారణకు ఇంటింటి సర్వే



గుంతకురప్పల్లెలో ఇంటింటిసర్వే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

బైరెడ్డిపల్లె, జూలై 23 : మండలంలోని గుంతకురప్పల్లె గ్రామంలో మంగళవారం జ్వరాల నివారణకు సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ ఆధ్వర్యంలో బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయచందర్, వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చేతుల శుభ్రత, పరిసరాల శుభ్రత పాటించాలని, కాచిచల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ● తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ వైద్యసిబ్బందితో సమావేశం ఏర్పాటుచేసి బీసీజీ వ్యాక్సిన్, కుష్ఠువ్యాధి నివారణపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారులు సావిత్రి, కాంతమ్మ, సూపర్‌వైజర్లు శ్రీదేవి, గోపి, ల్యాబ్‌టెక్నీషియన్ జిలానీ, ఏఎన్ఎంలు లక్ష్మి, పాపమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'మా ఉద్యోగాలు నిలపండి'

భువనేశ్వరికి రెస్కో సిబ్బంది విన్నపం



కుప్పం, జూలై 23: ఉద్యోగాలు పోకుండా తమను కాపాడాలని రెస్కో సిబ్బంది నారా భువనేశ్వరికి విన్నవించారు. కుప్పం పర్యటనకు వచ్చిన భువనేశ్వరిని గుడుపల్లె మండలంలో రెస్కో సంస్థలోని 121 మంది ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెస్కోలో తాము పర్మనెంటు ఉద్యోగులుగా వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నామన్నారు. నెల రోజులనుంచి తాము అభద్రతతో గడుపుతున్నామన్నారు. విచారణల పేరుతో జేసీ సమావేశమై నోటీసులు ఇవ్వ డానికి నిర్ణయించినట్లు చెప్పారన్నారు. ఉద్యోగాలు పోతే, తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు పోకుండా తమను రక్షించాలని ఆమెకు వినతిపత్రం సమర్పించారు.

కడాలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం


కుప్పం, జూలై 23: కడా (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయంలో పోస్టులను భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గురు ఆఫీస్ సబార్డినేట్స్, వాచ్‌మెన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఇద్దరేసి వంతున ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అభ్యర్థులు తమ క్వాలిఫికేషన్లతోపాటు, ఉద్యోగ అనుభవానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను 'ప్రాజెక్ట్ డైరెక్టర్ కడా అట్ ది రేట్ ఆఫ్ జీమెయిల్ డాట్ కామ్ ద్వారా పంపాలని సూచించారు. శనివారం ఇంటర్వ్యూ ఉంటుందని ఆయన తెలియజేశారు.

వాచ్‌ఉమెన్‌కు ఆర్థికసాయం



పుంగనూరు రూరల్, జూలై23: స్థానిక శుభారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వాచ్‌ఉమెన్‌గా పని చేస్తున్న పాపులమ్మకు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, అధ్యాపకులు కలసి మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపులమ్మ ఇటీవల రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిందన్నారు. దీంతో చికిత్సల నిమిత్తం రూ. 32వేలు ఆర్థిక సహాయం అందజేశామన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సయ్యద్‌మౌల

పుంగనూరు రూరల్, జూలై23: స్థానిక బసవరాజ ప్రభుత్వ బాలికల కాలేజీలో విద్యార్థులకు నోటు పుస్తకాలను మంగళవారం ఇంటర్మీడియట్‌శాఖాధికారి సయ్యద్‌మౌలా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం నోటు పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కమలాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కరకమందలో కుంభాభిషేకం

సోమల, జూలై 23: మండలంలోని కరకమంద చెన్నమల్లయ్య తాత ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం సందర్భంగా బుధవారం కుంభాభిషేకం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో గణపతిపూజ, స్వస్తివాచనం, కలశస్థాపన, దీక్షాహోమం, గణపతి హోమం, అష్టోత్తర శత దీపాలంకరణ, తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. 25న అభిషేకాలు, అర్చన, నవగ్రహ ఆరాధన, మూల మంత్ర జపాలు, హోమాది కార్యక్రమాలు జరుపనున్నారు. అలాగే ఈ నెల 27, 28వ తేదీల్లో కొలుపు ఉత్సవాలు జరుగనున్నాయి.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



తుగడంవారిపల్లె పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవోలు

సోమల, జూలై 23: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు శిక్షాసప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు శ్రీరాములు, శివరత్న పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తుగడంవారిపల్లె, సూరయ్యగారిపల్లె పాఠశాలల్లో శిక్షాసప్తాహ్ కార్యక్రమాలను పరిశీలించారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. స్థానికంగా లభించే వనరులతో బోధనాభ్యాసన సామగ్రిని తయారు చేసే విధానాలను విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా ముప్పల నరసింహులుశెట్టి



కల్లూరు, జూలై 23: రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా పులిచెర్ల మండలం కల్లూరుకి చెందిన ముప్పల నరసింహులుశెట్టిని నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్నరామ సత్య నారాయణ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముప్పల నరసింహులుశెట్టి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని, తనకు పదవి రావడానికి కృషి చేసిన ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షులు టీజీ వెంకటేష్, అధ్యక్షులు చిన్నరామ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

నారా భువనేశ్వరికి పూర్ణకుంభ స్వాగతం



కర్ణాటక సరిహద్దులో గజమాలతో స్వాగతం



శాంతిపురం, జూలై 23: నాలుగు రోజులు కుప్పం నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీయార్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారాభువనేశ్వరికి శాంతిపురం మండలం, కర్ణాటక సరిహద్దు ప్రాంతం కెంపాపురం వద్ద టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఆంధ్ర సరిహద్దు గ్రామం సాతు గ్రామం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు గజమాలతో స్వాగతం పలికారు. అదేవిధంగా వెంకటాపురం గ్రామం చేరుకున్న ఆమెకు సుమారు వందమంది మహిళలు పసుపుపచ్చ చీరలు ధరించి పూర్ణకుంభాలతో అపూర్వస్వాగతం పలికారు. రాళ్లబూదుగూరు, గెనికపల్లె క్రాస్, 64పెద్దూరు, చిన్నూరులలో కూడా ప్రజలు భువనేశ్వరికి ఘన స్వాగతాలు పలికారు. మహిళలు మంగళహారతులు పట్టారు. భువనేశ్వరికి స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌చార్జీ మునిరత్నం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, శాంతిపురం నాయకులు విశ్వనాథనాయుడు, నాగరాజు, విజయరామిరెడ్డి, ఏఎంసీనాగరాజు, ఆర్ఎస్‌మణి, నామాలప్ప, అనసూయ, వేదశ్రీ, చంద్రకళ, శ్యామలమ్మ, సుగుణమ్మలతో బాటూ కుప్పం, గుడుపల్లె, రామకుప్పం మండలాల నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలకు సత్వర న్యాయం అందించండి

రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ముమ్మరం చేయండి ● వి.కోట, గుడుపల్లె స్టేషన్ల తనిఖీల్లో ఎస్పీ



వి.కోట పోలీస్ స్టేషన్‌లోని కంప్యూటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

వి.కోట, గుడుపల్లె, జూలై 23: న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు పోలీసులు కృషి చేయాలని ఎస్పీ మణికంఠ అన్నారు. మంగళవారం ఆయన వి.కోట, గుడుపల్లె పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లలో క్రైం రికార్డులు, కేసు డైరీలను పరిశీలించి అధి కారులకు తగిన సూచనలు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసుల విచారణ త్వరగా పూర్తి చేయాలన్నారు. పాతకేసుల్లో అనుమానం ఉన్న నిందితులను అరెస్టు చేసి బైండోవర్ చేయాలన్నారు. రెండు స్టేషన్లు సరిహద్దులో ఉండటం వల్ల రౌడీషీటర్ల కదలికలపై నిఘా ముమ్మరం చేయాలన్నారు. రాత్రి వేళ నిరంతర నిఘా ఉంచి నేరాల అదుపునకు కృషి చేయాలని సూచించారు. పాత గొడవలు, భూవివాదాలు మొదలైన వాటిపై దృష్టిసారించి నేరాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వి.కోటలో రికార్డులను పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ చర్యలను సీఐ లింగప్ప ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో కుప్పం డీఎస్పీ శ్రీనాథ్, ఎస్ఐలు బాబు, శ్రీనివాసులు, ఇతర పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో చెత్త కనిపించరాదు: కమిషనర్



మురుగునీటి కాలువలో పూడికను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు, జూలై23: మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా రోడ్డువెంట, మురుగు కాలుల్లో చెత్త కనిపించరాదని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ ఇంజినీర్లతో కలిసి పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఆగస్టులో ప్రారంభం కానున్న అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. గుడి యాతం రోడ్డులోని కమ్యూనిటీ హాల్ మరమ్మతు పనులను తనిఖీచేసి పలు సూచ నలు చేశారు. అక్కడినుంచి టీఎస్ అగ్రహారం, ఆర్‌కే.స్ట్రీట్, గంటావూరు సచివాల యాలను సందర్శించారు. రిజిస్టర్‌లను తనిఖీచేశారు. గాంధీనగర్‌లోని రాచకాలువను పరిశీలించి పేరుకు పోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని సిబ్బందికి సూచించారు. వర్షాలు కురుస్తున్నందున మురుగునీటికాలువల్లో, రాచకాలువల్లో ఎక్కడా నీరు నిల్వకుండా చూడాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎప్పటి కప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని, తాగునీటి సరఫరాలో ఎటువంటి కలుషిత నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి ట్యాంకుల్లో క్రమంతప్పకుండా క్లోరినేషన్ చేస్తుండాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఇంజినీర్ రూపేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు కృషితోనే బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యత



ఎల్లంకివారిపల్లిలో స్వీట్లు తినిపించుకొని సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

కల్లూరు, జూలై 23: సీఎం చంద్రబాబు కృషితోనే కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అధిక ప్రాధాన్యత ఇచ్చారని టీడీపీ నాయకులు మునికృష్ణమనాయుడు, గోపినాయుడు, నూర్‌బాషా తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి భారీగా నిధులు కేటాయించడంపై మంగళవారం పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి, కల్లూరులో టీడీపీ శ్రేణులు టపాకాయలు పేల్చి స్వీట్లు తినిపించుకొని సంబరాలు చేసుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రధానమంత్రి, హోం మంత్రి, ఆర్థిక మంత్రి తదితరులను ఒప్పించడంతో బడ్జెట్‌లో తగిన కేటాయింపులు జరిగాయన్నారు. ఏపీ అభివృద్ధికి కృషిచేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



సోమల, జూలై 23: మండలంలోని ఆవులపల్లెకు చెందిన దాత శేషం లక్ష్మమ్మ పలు పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రిని ఉచితంగా అందజేశారు. మంగళవారం అన్నెమ్మ గారి పల్లె పాఠ శాలలో 84 మందికి నోటు పుస్తకాలు, పలకలు తదితర వస్తువులను అందజేశారు. అలాగే ఆవులపల్లె పాఠశాలలో 60 మందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు బడుల విద్యార్థుల కంటే ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎంలు ఎస్‌కే.జరీనా, పృథ్వీ, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటుచేయండి

బైరెడ్డిపల్లె, జూలై 23 : బైరెడ్డిపల్లెలోని నాలుగురోడ్ల కూడలివద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు. బస్‌షెల్టర్ లేకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఇతర ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపక్కన ఎండకు, వానకు ఇబ్బందిపడాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వేతన జీవులను, విశ్రాంత ఉద్యోగులను నిరాశపరిచిన బడ్జెట్

పలమనేరు, జూలై23 : కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉద్యోగుల సంఘ నాయకులు, మేధావుల పోరం అధ్యక్షులు తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు.

అమరావతికి సాయం శుభపరిణామం



పాత పెన్షన్ పునరుద్ధరణపై ఎటువంటి సానుకూల ప్రకటన లేదు. ఇది ఉద్యోగ వర్గాలకు తీవ్ర నిరాశ కలిగించింది. అయితే అమరావతి నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు, పరిశ్రమల స్థాపనకు, వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక నిధుల కేటాయిం పులకు ప్రాధాన్యం ఇవ్వడం శుభ పరిణామం.

- ఆనందబాబు, పలమనేరు తాలూకా ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు

- సీపీఎస్‌పై నిరాశ మిగిల్చిన బడ్జెట్



ఆదాయపన్ను పరిమితిని రూ.3లక్షలకు కాకుండా రూ. 5లక్షలు చేసి ఉండే బాగుండేది. నూతన పెన్షన్ విధానంలో మార్పులు చేస్తామన్నా దాని విధి విధానాల్లో నిర్దిష్ట ప్రకటన లేదు. బడ్జెట్ వేతన జీవులను తీవ్ర నిరాశ పరిచింది.

- ఎన్.సోమచంద్రారెడ్డి, పలమనేరు మేధావుల సంఘ అధ్యక్షులు

మాజీ సర్పంచ్ నాగప్పగౌడు మృతి



బైరెడ్డిపల్లె, జూలై 23 : మండలంలోని గుంతకురప్పల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీసర్పంచ్ నాగప్పగౌడు మంగళవారం మృతి చెందారు. ఆయన మృతిపట్ల టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు సంతాపం తెలిపారు. నాగప్పగౌడు మృతదేహం వద్ద నివాళులర్పిం చారు. వారి కుటుంబీకులను పరామర్శించారు.

టీడీపీ ఆధ్వర్యంలో కాటిపేరిలో పారిశుధ్య పనులు



చౌడేపల్లె, జూలై23: మండలంలోని కాటిపేరిలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య పనులు చేట్టారు. కాటిపేరిలో కొంత కాలంగా మురుగు కాలువలు శుభ్రం చేయలేదు. ఫలితంగా అవి దుర్గంధం వెదజల్లుతూ దోమలకు నిలయంగా మారాయి. స్థానిక టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు ఆధ్వర్యంలో కాలువలు శుభ్రం చేశారు. దోమల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారి చేయించారు.

సీపీఐ సభను జయప్రదం చేయాలి

పుంగనూరు రూరల్, జూలై23: ఆగస్టు 4న చిత్తూరులో జరిగే సీపీఐ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజన్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక భగత్‌సింగ్ కాలనీలో హమాలీ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమ పథకాలను అమలు చేయాలని, ఏడాదిలో ఒకసారి ఉచితంగా హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేసి ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు దామోదం, రామమూర్తి, మున్నా, వెంకటేశ్, సురేష్, రమణ, జయకుమార్ పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రభావతిదేవి



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రభావతిదేవి

గంగవరం, జూలై 23: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి పేర్కొన్నారు. మంగళవారం మారేడుపల్లె గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ముఖ్యంగా రోగులకు అందుతున్న వైద్యం, అందు బాటులో ఉన్న మందులు, ఇతర సౌకర్యాలపై ఆరాతీశారు. ప్రజలకు అన్నిరకాల వ్యాధులకు వైద్యం అందించాలన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో దోమలు, ఈగలు బెడద అధికంగా ఉండే ప్రమాదముందన్నారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేసి ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, వైద్యాధికారి శ్రీనివాసులు, డాక్టర్ లహరి, సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్, ఆశావర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి మరు పొంగళ్లు



కల్లూరు, జూలై 23: పులిచెర్లలో వెలసిన గంగమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం మరు పొంగళ్ల వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామం నుంచి మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మహిళలు పొంగళ్లతో ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. వివిధరకాల పుష్పాలతో అలంకృతురాలైన గంగమ్మ తల్లి భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. భక్తులకు అర్చకులు రాజశేఖర్ దీక్షితులు తీర్థప్రసాదాలు అందజేశారు.

రెవెన్యూ రికార్డు గదికి పోలీసు భద్రత

• కలెక్టరు ఆదేశాలతో పుంగనూరులో తక్షణం ఏర్పాటు
• సీసీ కెమెరాలతో నిఘా • డీఎస్పీ, తహసీల్దారు తనిఖీ



గార్డు విధులు నిర్వహిస్తున్న ఏఆర్ పోలీసులు

పుంగనూరు, జూలై 23: పుంగనూరు రెవెన్యూ రికార్డుల భద్రతపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆరా తీశారు. రికార్డుల గది భద్రతకు పోలీసు గార్డు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శివయ్యను ఆదేశించారు. 'పుంగనూరులో భద్రమేనా?, కార్యాలయం ఒకచోట..రెవెన్యూ రికార్డుల గది మరోచోట, భద్రతలేనిచోట విలువైన డాక్యుమెంట్లు' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. నివేదిక అందించాలని ఆదేశించారు. పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్, పుంగనూరు తహసీల్దార్ శివయ్య, సీఐ జయరామయ్య, తదితర

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పోలీసు, రెవెన్యూ అధికారులు రాతిమసీదు వీధిలోని పాత తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డుగది, గది ముందు, వెనుక ప్రాంతాలను పరిశీలించారు. తహసీల్దార్ శివయ్య రిపోర్టు మేరకు రికార్డు గది భద్రతకు మంగళవారం రాత్రి నుంచి ఒక హెడ్‌కానిస్టేబుల్, నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లను 24గంటల పాటు గార్డు ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.



రికార్డు గదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శివయ్య, డీఎస్పీ విష్ణురఘువీర్

గది వెనుక భద్రతలేని కిటికీలు, తలుపు తొలగించి వాటి స్థానంలో పటిష్టంగా గోడ నిర్మించే పనులు బుధవారం చేపట్టడానికి ఏర్పాట్లు చేశారు. అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌సేఫ్టీ సిలిండర్ పరికరాలు, రికార్డుగదికి చుట్టూ పది సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ వివరించారు. రికార్డు గదిలోపల అధికారులు పరిశీలించి రికార్డులు అన్ని ఉన్నాయన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యాలయంలోని కొన్ని ముఖ్యమైన రికార్డులను చిత్తూరు కలెక్టరేట్‌కు తరలిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న నూతన తహసీల్దార్ కార్యాలయ భద్రతపై సీసీ కెమెరాలు తదితర అంశాలపై చర్చించి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల్లో సీఐ జయరామయ్య, పుంగనూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వసీం, సీనియర్ అసిస్టెంట్ శివకుమారి, వీఆర్వో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా పుంగనూరు నియోజకవర్గంలోని రాగానపల్లె 982 ఎకరాల భూమి, నేతిగుట్లపల్లె, ఆవులపల్లె ప్రాజెక్టులు, పుంగనూరు బైపాస్‌రోడ్డు భూసేకరణ, అనేక అసైన్డ్ భూముల విషయంలో గత ప్రభుత్వంలో పెద్దలు అవకతవకలకు పాల్పడటంతో విలువైన రికార్డులు ఎక్కడ మదనపల్లె తరహాలో కాలిపోతాయోనంటూ స్థానికంగా చర్చ సాగడం గమనార్హం.

అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై ఆరా

• జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు బిజీబిజీ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 23: జిల్లాలో డీకేటీ భూముల రిజిస్ట్రేషన్లపై అధికారులు దృష్టి సారించారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన లావాదేవీల వివరాలను సేకరిస్తున్నారు. ఈ భూముల యాజమాన్య హక్కులు లబ్ధిదారులకు కల్పిస్తూ గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన చట్టం ముసుగులో ఆ పార్టీ నాయకులు అక్రమాలకు తెరలేపారు. ముఖ్యంగా మాజీమంత్రి పెద్దిరెడ్డి అనుచరులు, బినామీలు తప్పుడు డాక్యుమెంట్లతో వందల ఎకరాలకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారనే కుట్ర బహిర్గతవ్వడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈనేపథ్యంలో జిల్లాలో 13 సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. బికొత్తకోట, బంగారుపాళ్యం, చిన్నగొట్టిగల్లు, చిత్తూరు (ఆర్వో), చిత్తూరు రూరల్, కలికిరి, కుప్పం, మదనపల్లి, పలమనేరు, పీలేరు, పుంగనూరు, తంబళ్లపల్లి, వాయల్పాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2019 నుంచి 2024 వరకు జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలను మంగళవారం ఉదయం నుంచి పొద్దుపోయేదాకా జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు సేకరించడంలో నిమగ్నమయ్యారు. 20 ఏళ్లు పైబడిన అసైన్డ్ భూములు, చుక్కల భూములపై వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవోతో జిల్లాలోని వైసీపీ నాయకులు భూములను కారుచౌకగా కొట్టేశారు. అసైన్డ్ భూములను 22ఏ నుంచి తీసేయించి ఫ్రీ హోల్డ్ పట్టాలు పొందారు. వాటికి రిజిస్ట్రేషన్లు చేయించారు. జిల్లావ్యాప్తంగా ఇవి ఎన్ని జరిగాయంటూ రెండు ప్రొఫార్మాల ద్వారా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ఆరా తీస్తున్నారు. ఈనెల 25న మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ చీఫ్ సెక్రటరి సిసోడియా అధ్యక్షతన సమీక్షా సమావేశంలో ఈ వివరాలను సమీక్షించనున్నట్లు సమాచారం. సమావేశానికి 14 మంది సబ్‌రిజిస్ట్రార్లు హాజరు కానున్నట్లు తెలిసింది.

ఆగమేఘాలపై దేవదాయ రికార్డుల పరిశీలన

చిత్తూరు కల్చరల్, జూలై 23: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల కాల్చివేత నేపథ్యంలో దేవదాయశాఖ అప్రమత్తమైంది. ఆ శాఖ జిల్లా కార్యాలయంలో మంగళవారం రాత్రి అసిస్టెంట్ కమిషనరు ప్రసన్నలక్ష్మి తన సిబ్బందితో సమావేశమయ్యారు. విధులు ముగించుకుని వెళ్లిన సిబ్బందిని వెనక్కు రప్పించారు. అసైన్డ్ భూముల రికార్డులను వీరు పరిశీలించారు. బుధవారం సీఐడీ అధికారులు వచ్చే అవకాశం ఉందని తెలిసింది. కాగా, రాగానిపల్లె అసైన్డ్ భూముల రికార్డులను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లె భాగమైనందున ఆ ప్రాంతంలోని దేవదాయ భూములు జిల్లా ఏసీ కార్యాలయ పరిధిలోకి వస్తాయి. వీటన్నిటి దృష్ట్యా అసిస్టెంట్ కమిషనరు రికార్డులను పరిశీలించారు.

తహసీల్దార్ల రిలీవింగ్ గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 23: పొరుగు జిల్లాల నుంచి వచ్చిన మండల తహసీల్దార్ల రిలీవింగ్ వ్యవధి మంగళవారం నుంచి గురువారానికి పొడిగించారు. ఫిబ్రవరి 1న జోన్-4 పరిధిలోని మూడు జిల్లాల నుంచి వచ్చిన 31 మంది తహసీల్దార్లకు మంగళవారం వారి సొంత జిల్లాలకు వెళ్ళేందుకు ఆర్డర్లు ఇచ్చారు. ఆ తర్వాత రిలీవింగ్ గడువును కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారానికి మార్పు చేశారు. కౌలుదారులకు రుణకార్డులు, రేషన్‌కార్డుల పంపిణీ వివరాల పునఃపరిశీలన చేయాలని సూచించారు. ఐదు నెలలుగా పెండింగ్‌లోని సుమారు 2500 కుల ధ్రువీకరణ పత్రాలను సుమోటోగా క్షేత్రస్థాయిలో వెళ్లి వారి అర్హత పరిశీలించి నివేదిక అందజేయాలని కలెక్టర్ సూచించారు.

కాఫీలో మత్తుమందిచ్చి చైన్ స్నాచింగ్

చిత్తూరు, జూలై 23: మాయమాటల్లో దింపి, మత్తు మందు కలిపిన కాఫీ ఇచ్చి మహిళ బంగారు చైన్ దొంగలించుకెళ్లిన వైనమిది. ఒకటవ పట్టణ సీఐ విశ్వనాథరెడ్డి వివరాల మేరకు...పాలసముద్రం మండలం ఆముదాలకు చెందిన సరస్వతమ్మ(55) సోమవారం మధ్యాహ్నం బంధువుల ఇంటికి వెళ్లడానికి చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. అక్కడకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమెను మాటల్లో దింపాడు. అనంతరం ఆమెకు కాఫీ తీసుకుని అందులో మత్తు మందు కలిపి ఇచ్చాడు. కాఫీ తాగిన కొద్ది క్షణాల్లోనే ఆమె మత్తులోకి జారుకుంది. వెంటనే దొంగ ఆమె మెడలోని 24గ్రాముల బంగారు చైన్‌ను తీసుకెళ్లిపోయాడు. గంట తరువాత ఆమె మేలుకుని చూస్తే మెడలోని చైన్ కనపడలేదు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రాయలచెరువు వంకను అమ్మేస్తున్నారు

వైసీపీ నేత దుశ్చర్య • ఆక్రమణను పట్టించుకోని అధికారులు • భారీ వర్షాలొస్తే వరద ముప్పు తప్పదు

పుంగనూరు, జూలై 23: పుంగనూరులో విలువైన రాయలచెరువు వంకను ప్రముఖ వైసీపీ నేత పూడ్చేసి.. ఆక్రమిస్తున్నారు. కుంట స్థలం రూ.15 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు అమ్ముతున్నారు. పుంగనూరు రాయలచెరువు నిండితే స్కావెంజర్ కాలనీ, కొత్తఇండ్లు హైస్కూల్, మోర్ వెనుక, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదురుగా , చౌడేపల్లె రోడ్డు, చెంగళాపురం వంకల నుంచి కౌండిన్యనదిలో కలిసి చదళ్ల చెరువుకు వరదనీరు ప్రవహిస్తాయి. వంకమధ్యలో పూర్వం పలుచోట్ల చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. చెక్‌డ్యామ్‌లు, కాజ్‌వేలు వెడల్పుతో ఉండగా విలువైన ప్రాంతాల్లో వంకలను రాజకీయ అండతో కొందరు ఆక్రమించారు. వాటిని గతంలో కొందరు అధికారుల ద్వారా రికార్డులు మార్చుకుని హక్కుదారులుగా చెలామణి అవుతున్నట్లు ఆరోపణలున్నాయి. మదనపల్లె రోడ్డు, చౌడేపల్లె రోడ్డులోని కాజ్‌వే వద్ద వంకను కొంతకాలం కిందట ఆటో స్టాండ్‌కోసం మట్టితోలి చదును చేశారు. అలాగే వైసీపీ నేత స్థలాల విక్రయాలతో రోజురోజుకు వంక ఆక్రమణలతో కాలువగా మారుతోంది. తమవద్ద భూమికి సంబంధించి రికార్డులు ఉన్నాయని, అందుకే విక్రయిస్తున్నట్లు ఆ నాయకుడు దర్జాగా చెబుతున్నారు. రాయలచెరువు మొరవ నుంచి చెంగళాపురం సమీపం వరకు ధరలు చుక్కలు తాకుతుండగా వంకను స్థలాలుగా ఆక్రమించి వైసీపీ నేతలు పలుచోట్ల నిర్మాణాలు చేశారు. గతంలో పుంగనూరులో రెండు పర్యాయాలు భారీ వర్షాలు కారణంగా వరద నీరు పారడానికి వంకలు ఆక్రమణలకు గురవడంతో వరదలు వచ్చి భారీ నష్టాలు జరిగాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆక్రమణలను అడ్డుకునే ధైర్యం అధికారులకు లేకపోవడంతో నేతలు ఆక్రమణలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. వెంటనే ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించి వంక ఆక్రమణలు తొలగించడానికి సర్వే చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





ఆక్రమణలకు గురైన రాయలచెరువు వంక



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న కూటమి నాయకులు

వైసీపీ నేత నుంచి వంకను కాపాడండి

రాయలచెరువు మొరవనీరు వెళ్లే వంక ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకుని వంకను కాపాడాలని పుంగనూరు తహసీల్దార్ శివయ్యకు మంగళవారం బీజేపీ, టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర బీజేపీ మైనార్టీ నాయకులు అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ పట్టణంలోని రాయలచెరువు మొరవ కాలువ సర్వే నెంబర్ 134ను ఖాతా నెంబర్479గా వైసీపీ నాయకులు ఆక్రమించి విక్రయాలు చేశారని, అధికారులు పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దోభీకాలనీలో ప్రవహించే వంకను పూర్తిగా కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేసినట్లు తెలిపారు. కాల్వ అధికభాగం ఆక్రమణ కావడంతో వర్షాలు అధికంగా కురిస్తే ఇళ్లలోకి నీరు చేరి ప్రమాదం జరిగే అవకాశాలు అధికంగా ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బీజేపీ నేత బి. నరసింహులు, టీడీపీ నాయకులు సద్దాంహుస్సేన్, నదీమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ఉంటా

• ముఖాముఖిలో భువనేశ్వరి హామీ



కోటపల్లె సమావేశంలో మాట్లాడుతున్న భువనేశ్వరి

గుడుపల్లె, జూలై 23: గుడుపల్లె మండలంలో మంగళవారం నారా భువనేశ్వరి పర్యటించారు. కమ్మగుట్లపల్లె, కంచిబందార్లపల్లె, కోటపల్లె, గుత్తార్లపల్లె గ్రామాలలో మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు తమ సమస్యలను ఆమెకు విన్నవించుకున్నారు. తమ పొలాన్ని కొంతమంది ఆక్రమించుకోవడంపై అధికారుల వద్దకెళ్లినా న్యాయం జరగలేదని కమ్మగుట్లపల్లెకు చెందిన లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తంచేశారు. 'మీదగ్గర ఉన్న ఆధారాలు నాకు ఇవ్వండి. అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తా. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ పాలనలో పేదల భూములు కబ్జాకు గురయ్యాయి. ఇలాంటి వారందరికీ ప్రత్యేక కోర్టుల ద్వారా సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి కంకణబద్ధులై ఉన్నారు. ధైర్యంగా ఉండండి, న్యాయం జరుగుతుంది' అంటూ భువనేశ్వరి ఆమెకు భరోసానిచ్చారు. అలాగే, గ్రామాల్లో సమస్యలపై కొందరు ప్రస్తావించగా.. ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, అధికారులతో మాట్లాడి ప్రతివొక్కరికీ న్యాయం చేస్తామని తెలిపారు.

వెల్లువెత్తిన అభిమానం



చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక తొలి సారిగా కుప్పం పర్యటనకు వచ్చిన నారా భువనేశ్వరిపై ప్రజలనుంచి అభిమానం వెల్లువెత్తింది. బెంగళూరు నుంచి ఆమె కోలార్, కేజీఎఫ్ మీదుగా కర్ణాటక సరిహద్దు కెంపాపురం చేరుకున్నారు. అక్కడినుంచి ఆంధ్రా సరిహద్దు అయిన సాతు దగ్గర టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు పెద్దయెత్తున ఆహ్వానం పలికారు. అక్కడినుంచి కమ్మగుట్లపల్లెకు వచ్చే మార్గంలో ప్రజలు రోడ్డు పక్కన నిలబడి పూలు చల్లి, మంగళ హారతులిచ్చారు. మార్గమధ్యంలో ప్రతి గ్రామం వద్ద ఆపి, మంగళ హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్. సురేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, గుడుపల్లె మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టైరు పగిలి.. బస్సు షెల్టర్‌ను ఢీకొని

సిమెంటు లారీ బోల్తా

• బస్తాల నడుమ ఇరుక్కుని మృతిచెందిన డ్రైవరు
• కల్లూరు ఘాట్ రోడ్డులో ప్రమాదం

కల్లూరు, జూలై 23: పులిచెర్ల మండలం కల్లూరు ఘాట్‌రోడ్డులో సిమెంటు లారీ టైరు పగిలింది. అదుపుతప్పి పక్కనున్న బస్సు షెల్టరును ఢీకొంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ శివరాఘవన్ మృతిచెందారు. కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. లారీ డ్రైవరు శివరాఘవన్‌ది తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై తాలూకా తాండేరి పోస్టు అప్పాపట్టి గ్రామం. నంద్యాల జిల్లా బనగానపల్లి నుంచి సిమెంటు లోడుతో కోయంబత్తూరుకు బయలుదేరారు. మంగళవారం మధ్యాహ్నం కల్లూరు ఘాట్ రోడ్డు మలుపు కొమ్మిరెడ్డిగారిపల్లి బస్సు షెల్టర్ సమీపానికి చేరుకోగా.. లారీ ముందు టైరు బరస్ట్ అయింది. దీంతో ఒక్కసారిగా లారీ అదుపుతప్పింది. దీనిని డ్రైవర్ అదుపుచేసే క్రమంలో సమీపంలోని బస్సు షెల్టర్‌ను లారీ ఢీకొంది. దీంతో బస్సు షెల్టర్ కూలిపోయింది. లారీ ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. డ్రైవింగు సీటులో ఉన్న డ్రైవరు.. సిమెంటు బస్తాల మధ్యలో ఇరుక్కుపోయారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. లారీ బోల్తా పడటంతో సిమెంటు బస్తాలు పగిలి చెల్లాచెదరుగా పడిపోవడంతో సిమెంటు దుమ్ముతో ఆ ప్రాంతం నిండిపోయింది. సీటులో.. సిమెంటు బస్తాల మధ్య ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను కాపాడే ప్రయత్నం చేశారు. జేసీబీ సాయంతో 2గంటలు శ్రమించి డ్రైవర్ శివరాఘవన్‌ను బయటకు తీయగా.. అప్పటికే ఆయన మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.





బస్సు షెల్టర్‌ను ఢీకొని బోల్తా పడిన సిమెంటు లారీ - మృతి చెందిన శివరాఘవన్

వీడని గజదాడులు

రాత్రి జాగరణలో పల్లెజనం

పగలే ఏనుగుల మంద సంచారం

సోమల, జూలై 23: సోమల మండలంలో గజదాడులు ఆగడం లేదు. దీంతో జనం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. పంటలు నష్టంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. సోమవారం రాత్రి ఇర్లపల్లె నుంచి ఆవులపల్లె పంచాయతీలోని పత్రపల్లె, కొత్తూరు గ్రామ సమీపంలో రఘుపతి రెడ్డి, కిరణ్‌కు చెందిన మామిడి, టమోటా తోటల్లో స్వైరవిహారం చేశాయి. బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. మల్లేశ్వరస్వామి ఆలయంలో డ్రిప్ పరికరాలను విరిచేశాయి. అలాగే ఇరికిపెంట పంచాయతీలో మరో ఏనుగుల గుంపు టమోటా తోటల్లో సంచరించి ఉప్పలపాటి భానుప్రకాశ్, కృష్ణమనాయుడు, గొల్లపల్లె మణి, మునీశ్వర, కొల్లా నాగేశ్వరరావు, పంటలను ధ్వంసం చేశాయి. కోతకు సిద్ధంగా ఉన్న టమోటా తోటలను తొక్కివేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నెల రోజులుగా పులిచెర్ల, సదుం మండలాల వైపు వెళ్లిన ఏనుగులు మళ్లీ మండలంలోకి ప్రవేశించడంతో మామిడి రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లో అధికంగా నీలం రకం మామిడికాయలు కోయాల్సి ఉంది. ఈ సమయంలో ఏనుగుల సంచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెడ్డివారిపల్లె, కొత్తూరు, పత్రపల్లె, ఇర్లపల్లె ప్రజలు పొలాల వద్ద అగ్గి మంటలు వేసుకొని జాగరణ చేస్తున్నారు. కాగా మంగళవారం పగలే నెలుకూరివారిపల్లె సమీపంలో 5 ఏనుగుల గుంపు సంచరించాయి. స్థానిక సచివాలయాల్లో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏనుగుల బారినుంచి పంటలను కాపాడాలని, ఇప్పటికే నష్టపోయిన పంటలకు నష్టపరిహారం మంజూరుచేయాలని కోరారు.



పత్రపల్లె వద్ద టమోటాతోటలో ధ్వంసం చేసిన ఏనుగులు

మదనపల్లెలో చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు

చిత్తూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దుండగులు రికార్డులు కాల్చిన ఘటనపై మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా అక్కడికి మదనపల్లెకు వెళ్లి ఈ ఘటనపై లోతుగా విచారించారు. ఈ క్రమంలోనే చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు సుమిత్‌కుమార్, వెంకటేశ్వర్లు కూడా మంగళవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి హాజరయ్యారు. సిసోడియాతో మాట్లాడారు. ఈ ఘటనపై ఇద్దరు కలెక్టర్లకు కీలక విచారణ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇద్దరు కలెక్టర్లు మంగళవారం నుంచే తమకు అప్పగించిన బాధ్యతల్ని అమలు చేయడం ప్రారంభించినట్లు సమాచారం. కాగా, జిల్లాల విభనజకు ముందు పుంగనూరు, కుప్పం, పలమనేరు నియోజకవర్గాలు మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండేవి. దీంతో పుంగనూరు నియోజకవర్గ రికార్డులు ఇంకా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఉండే అవకాశాలున్నాయని సమాచారం. గత ఐదేళ్లలో పెద్దిరెడ్డి కుటుంబం అనేక ప్రాంతాల్లో భూఅక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. అదే సమయంలో మంగళవారం పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు మాధవరెడ్డి ఇంట్లో అధికారుల సోదాల్లో రెండు సంచుల రికార్డులు బయటపడ్డాయి. దీంతో కాలిపోయిన రికార్డులకు, జిల్లాకూ లింకు ఉందా అనే దిశగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

విద్యార్థులకు రుచికరమైన భోజనం: పీవో



టీచర్లతో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

యాదమరి, జూలై 23: విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని పెట్టాలని ఎస్ఎస్ఏ పీవో వెంకటరమణారెడ్డి ఆదేశించారు. పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం 14 కండ్రిగ జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలను సందర్శించారు. పీఎం పోషన్, గోరుముద్ద, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. రెండో దశలో మౌలిక వసతుల పనులను పరిశీలించారు. ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, హెచ్ఎం భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కె. గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు కనకాచారి, భారతి, హెచ్ఎం లలిత ఆధ్వర్యంలో శిక్షణా సప్తాహ కార్యక్రమం జరిగింది.

నేటి నుంచి ఆధార్ క్యాంపు

యాదమరి, జూలై 23: ఆధార్ కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం బుధవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపును నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 184 గొల్లపల్లె, 25న 14 కండ్రిగ, 26న వరదరాజులపల్లె, 27న మాదిరెడ్డిపల్లె సచివాలయాల్లో క్యాంపు జరుగుతుందన్నారు. 24న జంగాలపల్లె, 25న బుడితిరెడ్డిపల్లె, 26న మోర్ధానపల్లె, 27న కోణాపల్లె సచివాలయాల్లో జరుగుతుందన్నారు.

కారుణ్య నియామకపత్రాల అందజేత



చిత్తూరు, జూలై 23: నగరపాలక సంస్థలో ఇద్దరికి కారుణ్య నియామకపత్రాలను మేయర్ అముద మంగళవారం అందజేశారు. పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మరణించిన అప్పాదొరై, షణ్ముగం కుటుంబసభ్యులు చేసుకున్న కారుణ్య నియామక దరఖాస్తులను కమిషనర్ అరుణ పరిశీలించారు. అప్పాదొరై కుమారుడికి పార్కు వాచ్‌మన్‌గా, షణ్ముగం కుమారుడిని ఎలక్ట్రీషియన్‌గా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను మంగళవారం మేయర్ అముద వారికి అందించారు.

భవిత కేంద్రానికి భోజన ప్లేట్ల వితరణ



చిత్తూరు రూరల్, జూలై 23: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని భవితకేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు మంగళవారం భోజన ప్లేట్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధిమాంద్యం పిల్లలకు సహాయం చేయడం, వారితో గడపడం ఆనందంగా ఉందన్నారు. దాతలు ముందుకొచ్చి ఇలాంటి వారికి సాయం చేయాలని కోరారు. ఆయన్ను ఉపాధ్యాయులు అభినందించారు.

పిచ్చిమొక్కల తొలగింపు

పాలసముద్రం, జూలై 23: బాలక్రిష్ణాపురం ఆదిఆంధ్రవాడలో మంగళవారం గ్రీన్ అంబాసిడర్లు ఇళ్లమధ్య పెరిగిపోయిన పిచ్చిమొక్కలను తొలగించారు. వర్షపునీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టారు. అనంతరం బ్లీచింగ్ చల్లారు. ప్రజలు కూడా తమ ఇండ్ల వద్ద మురికినీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని పంచాయతీ కార్యదర్శి రమేష్ అవగాహన కల్పించారు.

కరియ మారియమ్మగా భక్తులకు దర్శనం

నగరి జూలై23:నగరి దేశమ్మ దేవాలయంలో ఆడిమాస ఉత్సవాలు వైభవంగా జరిగాయి. రెండవ మంగళవారం సందర్భంగా దేశమ్మతల్లి కరియ మారియమ్మ వేషధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. చలువ పందిళ్లను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మూలస్థానం అఓ అమ్మవారికి చెన్నైకి చెందిన పరిమళన్ చందన అలంకరణ, ఉత్సవమూర్తికి సీఎం భాస్కర్ పుష్పాలంకరణ చేయించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నీటిపైపు లీకేజీతో తిప్పలు



నగరి జూలై23: ప్రకాశం రోడ్డుపై చావడి వద్ద తాగునీటి పైపు లీకేజీ కావడంతో వారం రోజులుగా రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. స్థానికులు ఈ విషయాన్ని మున్సిపాలిటీ డీఈఈ దృష్టికి తీసుకువచ్చారు. ఈమార్గంలో కరకంఠేశ్వరస్వామి ఆలయం, పెరుమాళ్‌గుడికి భక్తులు వెళ్తుంటారు. వాహనాలు వస్తే బురదనీరు భక్తులపై పడుతోంది. ద్విచక్ర వాహనదారులకు కూడా తిప్పలు తప్పడం లేదు. కమిషనర్ మంజునాథగౌడ్‌కు వివరించగా చెన్నై నుంచి మెటీరియల్ రాగానే లీకేజీ అరికడతామన్నారు.

ముస్తాబవుతున్న కందగిరికొండ ఆలయం

గుడిపాల,జూలై 23: కుప్పిగానిపల్లె సమీపంలోని కందగిరికొండ ఆలయంలో ఈనెల 28న నిర్వహించనున్న కావడి మొక్కులకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యనాయుడు, కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ కావళ్లు చెల్లించే భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు.

పేదలకు అన్నదానం



గుడిపాల, జూలై 23: పేదల కడుపు నింపడమే ప్రభుత్వ ధ్యేయమని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, జయదేవనాయుడు అన్నారు. ఇందులో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నామని వారు తెలిపారు. టీడీపీ నాయకులు గుర్రప్పనాయుడు, హరిప్రసాద్, శివలింగారెడ్డి,చల్లా,బాబు,కనకనేరురవి,రాష్ట్ర ఆర్టీసీ యూనియన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు స్వామినాథ్‌గౌడ్,ఎలుమలై తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో అధిక దిగుబడి



రైతులకు సూచనలిస్తున్న మాధవి

గుడిపాల, జూలై 23: అవగాహనతోనే అధిక దిగుబడి సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి మాధవి అన్నారు. మంగళవారం పేయన్నపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగలో చీడపీడలను, వృక్ష సంబంధిత కషాయాల తయారీ విధానాన్ని చేసి చూపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రైతులకు సూచనలు ఇచ్చారు.

ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించండి



నర్సరీ పనులను పరిశీలిస్తున్న రాజశేఖర్

తవణంపల్లె, జూలై 23: మండలంలోని ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని డ్వామా పీడీ రాజశేఖర్ ఆదేశించారు. కారకాంపల్లెలో ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న చెరువు కాలువ పనిని పీడీ మంగళవారం తనిఖీ చేశారు. ఈచనేరిలోని నర్సరీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకం, మల్లెపూలు, రోజా పూల సాగుపై చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కల్పించి పనులు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ఏపీడీ సుబ్రహ్మణ్యం, ఏపీవో లలిత, పాల్గొన్నారు.

ఇంకా మాజీ సీఎం జగన్ ఫొటోయేనా?

చిత్తూరు రూరల్, జూలై 23: చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి అధికారులకు ఇంకా సీఎం జగనేనని అనుకుంటున్నారు. ప్రభుత్వం మారి చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసి రెండు నెలలు కావస్తున్నా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి అధికారులు మాత్రం మేలుకోలేదు. ఆస్పత్రి ఆవరణలోని మెడికల్ ఆక్సిజన్ ప్లాంట్‌కు మాజీ ముఖ్యమంత్రి జగన్ పేరును, ఫొటోను తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అక్కడి వారు విమర్శిస్తున్నారు.

కుక్కదాడిలో విద్యార్థికి గాయాలు



చేతిపై గాయం

ఐరాల, జూలై 23: వెదర్లపల్లెలో మంగళవారం కుక్క దాడిలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి లోహిత్ పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమై ఇంటి ముందు ఉండగా ఓ కుక్క ఇష్టానుసారం దాడి చేసింది. విద్యార్థికి చేతిపై, ముఖంపై, చాతిపై, కాళ్లపై తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే ఐరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇటీవల నాగమువాండ్లపల్లె పాఠశాలలో పిచ్చికుక్క దూరి విద్యార్థులకు కరచిన సంఘటనను మరవక ముందే ఈ సంఘటన అందరినీ ఆందోళనకు గురిచేసింది.

నేడు నాలుగు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు రూరల్, జూలై 23: నాలుగు మండలాల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ కొత్తపల్లిమిట్ట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాలసముద్రం, జీడీ నెల్లూరు, ఎస్ఆర్ పురం, వెదురుకుప్పం మండల పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎస్టీ కాలనీలో తాగునీటి పైపులైన్ల ఏర్పాటు



శ్రీరంగరాజపురం, జూలై 22: కట్టికపల్లె ఎస్టీ కాలనీలో పాతబోరులో తాగునీరు నిలిచిపోవడంపై స్థానిక సర్పంచ్ మార్కొండయ్య, పంచాయతీ కార్యదర్శి జ్యోతినాథ్ స్పందించారు. పైపులైన్లు ఏర్పాటు చేయించారు. తాగునీరు సరఫరాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉభయదారులుగా అవకాశం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కార్వేటినగరం, జూలై 23: మండల గాండ్ల సంఘ సమావేశం కార్వేటినగరంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం మండల శాఖ అధ్యక్షులు మోహన్ మాట్లాడుతూ ఏటా జరిగే మహాభారత ఉత్సవాల సందర్భంగా గాండ్ల కులస్తులకు ఉభయ దారులుగా అవకాశం కల్పించాలని కోరారు. ఈమేరకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సంఘ నాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

కార్వేటినగరం, జూలై 23: ఆర్‌కేవిబిపేట గ్రామ పంచాయితీ పరిధిలోని కలికిరిండ్లులో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పొన్నా యుగంధర్ మంగళవారం ప్రారంభించారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా అన్ని గ్రామ పంచాయితీలో సభ్యత్వ కార్యక్రమాన్నిచురుగ్గా సాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ద్రౌపది అమ్మవారి ఊరేగింపు



వెదురుకుప్పం, జూలై 23: మహాభారతం ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ద్రౌపది అమ్మవారిని పచ్చికాపల్లంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఇంటింటా కర్పూర హారతులను ఇచ్చారు. అంతకు ముందుగా ద్రౌపది అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బంగారమ్మ ఆలయంలో విశేష పూజలు



కార్వేటినగరం, జూలై 23 : మండల కేంద్రంలోని గ్రామ దేవ బంగారమ్మ ఆలయంలో మంగళవారం విశేష పూజోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కడాలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం, జూలై 23: కడా (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయంలో పోస్టులను భర్తీ చేయడానికి దర ఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గురు ఆఫీస్ సబార్డి నేట్స్, వాచ్‌మెన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఇద్దరేసి వంతున ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అభ్య ర్థులు తమ క్వాలిఫికేషన్లతోపాటు, ఉద్యోగ అనుభ వానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను 'ప్రాజెక్ట్ డైరెక్టర్ కడా అట్ ది రేట్ ఆఫ్ జీమెయిల్ డాట్ కామ్ ద్వారా పంపాలని సూచించారు. శనివారం ఇంటర్వ్యూ ఉంటుందని వివరించారు.

ప్రభుత్వాస్పత్రిలో సదుపాయాలపై కలెక్టర్ ఆరా



కలెక్టర్ సుమిత్ కుమార్‌కు పరిస్థితులు వివరిస్తున్న ఆస్పత్రి అధికారి

చిత్తూరు రూరల్, జూలై 23: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. డయాలసిస్ కేంద్రం, ఎక్స్‌రే, క్యాజువాలిటీ, ఏపీ వార్డు, పీడియాట్రిక్. గైనిక్, లేబర్ వార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆరోగ్య పథకం సేవలను విస్తృతం చేయాలని ఆదేశించారు. సేవలు, సదుపాయాలను మెరుగుపరచాలని అపోలో, ప్రభుత్వ అధికారులకు సూచించారు. అనంతరం వారితో సమీక్షించారు. ఆస్పత్రిలో మౌలిక వసతులు, పారిశుధ్యం మెరుగుపర్చాలని, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, అపోలో హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎంవో సంధ్య, అపోలో ఏవో రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ వస్తున్నారనే ముందస్తు సమాచారంతో ఆస్పత్రి అప్రమత్తమైంది. మరుగుదొడ్లు శుభ్రం చేశారు. డైట్ నిర్వాహకులు మంచి బియ్యంతో రోగులకు అన్నం వడ్డించారు. ఆస్పత్రి ఆవరణ శుభ్రంగా ఉంచారు.

చిత్తూరు (సెంట్రల్): పశువైద్య శాలల పరిధిలో పశు సంపద కలిగిన రైతుల వివరాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. పశువైద్యశాఖ, ప్రాంతీయ పశు నిర్ధారణ ప్రయోగశాల కార్యాలయాలను తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వీధికుక్కల సమస్య నివారణకు కార్యచరణ అమలు చేయాలని జేడీ, మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. డీడీ సుబ్బమ్మ, పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి భారీ నిధులపై హర్షం

స్వాగతించిన కూటమి నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, జూలై23: సీఎం చంద్రబాబు నాయుడు కృషితో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో రాష్ట్రానికి భారీగా నిధుల కేటాయింపులు సాధ్యమయ్యాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపులపై హర్షం వ్యక్తం చేశారు. నేతలు మోహన్‌రాజ్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రానికి అధిక నిధులు కేటాయించినందుకు టీడీపీ రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.**చిత్తూరు రూరల్:** అమరావతి అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని నిరూపితమవుతుందని టీడీపీ జిల్లా నేత చంద్రప్రకాష్ అన్నారు. విభజన తర్వాత ఏపీకి కేంద్రం ఈ స్థాయిలో ప్రాధాన్యం ఇచ్చింది లేదని గుర్తు చేశారు. **పాలసముద్రం:** కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ నిధులు కేటాయించడం పట్ల రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మంగళవార ఆయనతోపాటు విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు వాసు నాయుడు, శేఖర్ రాజు, జె. విజయ్‌కుమార్, వాసు యాదవ్, అరుళ్‌నాథన్, సాంబశివన్ తదితరులు పాల్గొన్నారు. **చిత్తూరు (సెంట్రల్):** కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధికి నిధులు కేటాయింపులు హర్షణీయమని బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ప్రాధాన్యత నివ్వడాన్ని సీనియర్ నాయకులు చిట్టిబాబు స్వాగతించారు. ఆదాయపు పన్ను స్లాబ్ రేట్ల కొత్త విధానంతో ఉద్యోగులకు స్వల్ప ఊరట లభించిందని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ హర్షం వ్యక్తం చేశారు. **కార్వేటినగరం:** బీజేపీ యువమోర్చా నాయకులు నడింపల్లి యువరాజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర పురోగతికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. **వెదురుకుప్పం:** కేంద్ర బడ్జెట్‌ను ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ స్వాగతించారు.

దాతృత్వంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

● జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి



విద్యార్థులకు నగదు పంపిణీ చేస్తున్న లక్ష్మణ రెడ్డి

పూతలపట్టు, జూలై 23: పారిశ్రామికవేత్తలు దాతృత్వంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని జనచైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీ లక్ష్మణరెడ్డి కోరారు స్థానిక ఉన్నత పాఠశాలలో 2023-24లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఎస్. తేజస్వీ, అమృత హర్షిణి, లాహిరి, దేవిప్రసాద్, అస్మిత, ధనుశ్రీ, సాయి, విష్ణువర్ధన్, మోహిని, ఇంతియాజ్, హిమశ్రీలకు పూతలపట్టు రవికుమార్ రెడ్డి మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ రవికుమార్ జ్ఞాపకార్థం వారి కుమారులు హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఉమాపతిరెడ్డిలు స్థానిక ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని రూ.2.25లక్షలతో పునర్నిర్మించడం సంతోషకరమన్నారు. కొత్త గేటును డీఈవో దేవరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో వాసుదేవన్, మధు, దామోదర నాయుడు, సర్పంచ్ మాసిలామణి, ఉపసర్పంచ్ బాబు రెడ్డి, ఉపాధ్యాయనేత ఆనందనాయుడు, విద్యాకమిటీ చైర్మన్ రామూర్తి రెడ్డి, సురేంద్ర రెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు వేయకుంటే జీతం కట్: ఎంపీడీవో



సమీక్షిస్తున్న ఎంపీడీవో బ్రహ్మయ్య

విజయపురం, జూలై 23: సచివాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులు రోజూ బయోమెట్రిక్ హాజరు వేయాల్సిందేనని ఎంపీడీవో బ్రహ్మయ్య స్పష్టం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్ఎంలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇకపై రోజూ మూడు సార్లు బయోమెట్రిక్ వేయకపోతే జీతం కట్ చేస్తామని హెచ్చరించారు. పంచాయతీల్లో 15 రోజలకు ఒక సారి నీటిట్యాంకు, మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. ఫాగింగ్ చేయాలన్నారు. ఈవోపీఆర్డీ బాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

చిత్తూరు(సెంట్రల్), జూలై 23: ఎస్వీయూనివర్సిటీ మూడవ సెమిస్టర్ ఫలితాల్లో విజ్ఞానదీప్తి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని కళాశాల కరస్పాండెంట్ ప్రసన్న లక్ష్మీ తెలిపారు. సెండర్ ఇయర్ బీఎస్సీ(ఎంఎస్‌సీఎస్) విభాగంలో పది పాయింట్లకు గాను మీనా9.61, మీనాక్షి 9.61, రమ్య 9.51, హిమజ 9.19, రేఖ 8.95, దేవి 8.67 పాయింట్లు సాధించారు. సెండర్ ఇయర్ బీకాం(సీఏ) విభాగంలో పది పాయింట్లకుగాను భావన 9.48, నితీష 9.23, యామిని 9.23, శృతి 9.17, షాలిని 8.86, ఉష 8.77, యమున 8.77 సాయింట్లు సాధించారు. ఠీ విద్యార్థులను కళాశాల వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, రామాంజులు, జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ప్రకాష్‌చంద్రారెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ నరేష్‌చంద్రారెడ్డి, లెక్చరర్లు అభినందించారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



బంగారుపాళ్యం, జూలై 23: విద్యార్థులు బాగా చదువుకుని రాణించాలని జీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఈశ్వర్ నాయుడు, ఎన్ఆర్ఐ కళ్యాణ్‌లు ఆకాంక్షించారు. మంగళవారం పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఈశ్వర్ కళ్యాణ్ అభయం ట్రస్టు ద్వారా విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లోకనాథం నాయుడు, మోహన్ నాయుడు, మాధవ నాయుడు, మంజునాథ్, సుబ్బన్న, క్రిష్ణ, జానకిరామ్, మణి, ఉపాధ్యాయులు రఘు, సీఆర్పీ విల్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన మధుసూదన్‌రెడ్డి

ఐరాల, జూలై 23: మామిడి యాజమాన్య పద్ధతులపై మంగళవారం 35యర్లపల్లె పంచాయతీ దివిటివారిపల్లెలో ఉద్యానవన శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఉద్యానవన అధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ చెట్లపై అడ్డదిడ్డంగా పెరిగిన, ఎండిన కొమ్మలను సకాలంలో కత్తిరిస్తే ఎండచెట్టు మొదళ్లలో పడుతుందన్నారు. తర్వాత లీటర్ నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడు, డైమిథోయేట్, 2 మి.మీల వేపనూనె కలిపి పిచికారి చేయాలన్నారు. దున్నకాల సమయంలో ఉలవలు,అలసంద,జనుము,జీలుగ,పిల్లిపెసర,లాంటి పచ్చరొట్ట పంటలను పెంచి కలియ దున్నాలన్నారు. పది సంవత్సరాల చెట్లకు సుమారు వంద కేజీల పశువుల ఎరువు,2 కేజీల యూరియా,6 కేజీల సింగిల్‌సూపర్‌పాస్ఫేట్,2 కేజీల పోటాష్ ఎరువులను చెట్ల మొదళ్లకు 3నుంచి అడుగుల4 అడుగుల దూరంలో గాడి తీసి వెంటనే నీటి తడి ఇవ్వాలన్నారు. సర్పంచ్ మల్లీశ్వరి,ఉద్యానవన అధికారి సాగరిక తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ



తవణంపల్లె, జూలై 23:. అరగొండ పైమాఘంలో దోమ కాటు వలన వచ్చే వ్యాధులపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా యూనిట్ అధికారి ఫీర్ సాహెబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు పుట్టకుండా ప్రతి ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ తెరలను వాడాలన్నారు. జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటకం

వెదురుకుప్పం, జూలై 23: మహాభారతం ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ద్రౌపదీ మాన సంరక్షణ వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నెల 19వ తేదిన ధ్వజారోహణ కార్యక్రమంలో ఉత్సవాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ప్రదర్శించిన ద్రౌపదీ మాన సంరక్షణ ఘట్టం ఆకట్టుకుంది. ఉభయదారుగా ఎర్రమరాజుపల్లికి చెందిన టి.త్రిలోకరెడ్డి వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త ఎన్.మునిరత్నంరెడ్డి, ప్రధాన కార్యనిర్వాహకులు బొజ్జారెడ్డి, భీమ శంకర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బొబ్బలు రాకుండా పశువులకు టీకాలు

వెదురుకుప్పం, జూలై 23: పశువులకు బొబ్బలు రాకుండా ముందస్తుగా టీకాలు వేశామని పశు సంవర్ధక శాఖ లైవ్ స్టాక్ అసిస్టెంట్ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ మండలంలోని మాంబేడులో 150 పశువులకు ముందస్తు టీకాలు వేశామని చెప్పారు. టీకాలు వేయించుకోవడానికి పాడి రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మా ఉద్యోగాలు నిలపండి

● భువనేశ్వరికి రెస్కో సిబ్బంది విన్నపం



కుప్పం, జూలై 23: ఉద్యోగాలు పోకుండా తమను కాపాడాలని రెస్కో సిబ్బంది నారా భువనేశ్వరికి విన్నవించారు. కుప్పం పర్యటనకు వచ్చిన భువనేశ్వరిని గుడుపల్లె మండలంలో రెస్కో సంస్థలోని 121 మంది ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెస్కోలో తాము పర్మనెంటు ఉద్యోగులుగా వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నామన్నారు. నెల రోజులనుంచి తాము అభద్రతతో గడుపుతున్నామన్నారు. విచా రణల పేరుతో జేసీ సమావేశమై నోటీసులు ఇవ్వ దానికి నిర్ణయించినట్లు చెప్పారన్నారు. ఉద్యోగాలు పోతే, తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు పోకుండా తమను రక్షించాలని ఆమెకు వినతిపత్రం సమర్పించారు.